క్లుప్తంగా

అలరించిన చిరుతల రామాయణం



సీతారాముల వేషధారణలో కళాకారులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని రామసాగరంలో నిర్వహించిన సీతారామ చరిత్ర చిరుతల రామాయణం అలరించింది. గురువారం రాత్రి నుంచి నిర్వహిస్తున్న ఈ రామాయణ దృశ్యాలను కళాకారులు కళ్లకు కట్టినట్లుగా చూపించారు. శుక్రవారం సీతారాముల పట్టాభిషేకం, అనంతరం ఒడిబియ్యం పోసి ముగించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామసాగరం, దాచారం, చీమలకుంటపల్లె, ఎల్లంపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామ్మోహన్

మద్దూరు(హుస్నాబాద్): వనమహోత్సవంలో భాగంగా నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీలో సిద్ధం చేయాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ రామ్మోహన్ ఆదేశించారు. మండలంలోని నర్సాయపల్లిలోని నర్సరీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సన్ ఫ్లవర్ కొనుగోళ్లు ఎల్లుండితో ముగింపు

హుస్నాబాద్‌రూరల్: వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన సన్ ఫ్లవర్ కొనుగోళ్లను సోమవారంతో ముగించనున్నట్లు సూపర్ వైజర్ గంగాధర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 204 మంది రైతుల నుంచి 1,543 క్వింటాళ్ల కొనుగోలు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం(నాఫెడ్) కొనుగోలు చేసిన 1,225 క్వింటాళ్లకుగాను 156 మంది రైతులకు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన 318 క్వింటాళ్లకుగాను 48 మంది రైతులకు డబ్బులు రావాల్సి ఉందని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పది రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 17 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.26,500 జరిమానా, వారిలో ఒకరికి 14 రోజులు, మరొకరికి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు వారు తెలిపారు.

చెక్కులు అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బీమరి యాదగిరి, బైండ్ల యాదవ్వకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాజమహేందర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ మాజీ చైర్మన్ నంట బాపురెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, నరేశ్, యాదగిరి, కనకరాజు, రాజు, వివేక్, శ్రీకాంత్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సహాని

మద్దూరు(హుస్నాబాద్): మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా లొక్కుంట్ల చిన్ను సహాని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో తాగునీటి సరాఫరా సక్రమంగా జరిగేలా చూస్తానని చెప్పారు.

సంతలో అధిక తైబజారు వసూలు

హుస్నాబాద్: సంతలో కాంట్రాక్టుదారులు తమ ఇష్టారాజ్యంగా అధిక తైబజారు వసూలు చేసి రైతులు, చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. అంగడి టెండర్లను తగ్గించి మున్సిపల్‌కు వచ్చే ఆదాయానికి గండికొట్టారని మండిపడ్డారు. గత యేడాది కంటే రేట్లు అధికంగా పెంచారని, అంగడిలో కనీస సౌకర్యాలు లేవని వాపోయారు. అంగడి అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

గోకుల కృష్ణా.. గోపాలకృష్ణా..



భారీ రాతి స్తంభాలు.. పురాతన శిల్పకళా ప్రావిణ్యంతో తీర్చిదిద్దిన చెక్కడాలు. ఎత్తయిన గాలిగోపురంపై దేవతామూర్తులు.. గుడి పక్కగా ఈశాన్యంలో కోనేరు.. ఎదురుగా కల్యాణ మండపం.. ఊరేగింపు కోసం భారీ విమాన రథం.. వెరసి వర్గల్ మండల కేంద్రంలో పురాతన ప్రాశస్త్యం కలిగిన వేణుగోపాలుని భవ్యమందిరం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి 20వ తేదీ వరకు అంటే పదకొండు రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సావాలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- ముస్తాబైన వర్గల్ వేణుగోపాలుని ఆలయం
- నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పదకొండు రోజుల పాటు విశేష కార్యక్రమాలు

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రంలోని సంతాన కల్యాణ శ్రీవేణు గోపాలస్వామి ఆలయం 800 యేళ్ల పురాతన ప్రాశస్త్యం కలిగి ఉంది. ఆలయంలో ఏకపీఠంపై రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలుడు కొలువుదీరడం విశేషం. స్వామివారిని దర్శించుకుంటే సకల శుభాలు చేకూరుతాయని భక్తులు విశ్వసిస్తారు. హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో రాజీవ్ రహదారికి చేరువలో సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలో ఈ పురాతన ఆలయం వెలసింది.



రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం

దేనికదే ప్రత్యేకం..


నాటి చరిత్ర చాటేలా ఆలయం నిర్మితమైంది. చెక్కిన రాతి స్తంభాలు, చక్కని శిల్పసంపద, ఎత్తయిన ధ్వజస్తంభం, గాలిగోపురం నాటి కళావైభవాన్ని, నైపుణ్యాన్ని చాటుతాయి. ఆలయం ఎదుట ఉన్న కల్యాణ మండపం, ఆకాశన్నంటే విమాన రథం, రథశాల, నేలమాళిగను తలపించేలా ఏడంతస్తులుగా మెట్లతో నిర్మించిన కోనేరు.. దేనికదే ప్రత్యేకతగా నిలుస్తాయి.

ఉత్సవ వివరాలు

- శనివారం బాలభోగం, విశ్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ
- ఆదివారం ధ్వజారోహణం, గరుడ కల్యాణం, భేరీ పూజ, దేవతాహ్వానం
- 12న ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకం, రాత్రి 10 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం
- 13న రాత్రి గరుడ వాహనోత్సవ సేవ
- 14న రాత్రి గజవాహనోత్సవసేవ
- 15న హనుమత్ వాహనోత్సవసేవ
- 16న శేషవాహనోత్సవ సేవ
- 17న పొన్నవాహన సేవ
- 18న సుదర్శన హోమం
- 19న ఉదయం 4.30 గంటలకు రథ ప్రతిష్ఠ, పురవీధుల్లో స్వామివారి విమాన రథోత్సవ ఊరేగింపు
- 20న శతఘటాభిషేకం, చక్రతీర్థం, వసంతోత్సవం, పుష్పయాగం జరుగుతుంది. అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సావాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని గీతాజ్ఞాన మండలి ప్రతినిధులు కోరారు.



వర్గల్ వేణుగోపాలుని కోవెల



వేడుకల్లో పాల్గొన్న భక్తులు(ఫైల్)

నిజాలను వెలికితీస్తే కక్ష సాధింపు చర్యలా?



గజ్వేల్‌లో నిరసన చేపడుతున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి
- ఏపీ ప్రభుత్వం తీరుపై గజ్వేల్‌లో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నిరసన

గజ్వేల్‌రూరల్: నిజాలను వెలికి తీస్తున్న 'సాక్షి' దిన పత్రికపై ఏపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సహించరానిదని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి మండిపడ్డారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డి నివాసంపై ఏపీ పోలీసుల దాడిని వ్యతిరేకిస్తూ శుక్రవారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఏగొండస్వామి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు. ప్రజల పక్షాన పోరాడుతున్న సాక్షిపై ఏపీ ప్రభుత్వం కత్తికట్టడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి నోటీసులు లేకుండా ఏపీ పోలీసులు దాడికి దిగి సోదాలు చేపట్టడం ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రాములు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించే ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు, సీఐటీయూ నాయకులు రంగారెడ్డి, సీపీఐ నాయకులు రమణాకర్, యువజన సంఘాల నాయకులు వినోద్, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండలశాఖ అధ్యక్షుడు ఉబ్బని ఆంజనేయులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు కొల్గూరు మైసయ్య, చంద్రం, దుర్గసింగ్, మహేష్, జర్నలిస్టులు వై.సురేందర్, విజయరావు, శ్రీనివాస్, బాల్‌రాజు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను కించపర్చడం సరికాదు

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పోలీసు వ్యవస్థను కించపర్చే విధంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తొగుటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో పోలీసులను అడ్డుపెట్టుకుని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డవారు ఇప్పుడు వారినే కించపర్చే విధంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి పోలీసులను ఇష్టానుసారం వాడుకున్నారని ఆరోపించారు. ఎక్కడో ఒక్కచోట లంచం తీసుకుని పట్టుబడితే మొత్తం పోలీసు వ్యవస్థనే అవినీతిమయంగా వ్యాఖ్యానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు ఇచ్చి, ప్రలోభాలకు గురిచేసి దొడ్డిదారిలో ఎమ్మెల్యేగా గెలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డికి అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి, నాయకులు విజయ్‌పాల్‌రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, ప్రతీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

నంగునూరు(సిద్దిపేట): అపరిచితులతో అప్రమత్తంగా వ్యవహరించాలని ట్రైనీ ఎస్‌ఐ సౌజన్య గ్రామస్తులకు సూచించారు. సిద్దిపేట షీ టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజగోపాల్‌పేటలో మహిళల కోసం ఉన్న రక్షణ చట్టాలు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్‌కు వచ్చే లింక్‌లు, ప్రకటనల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కిషన్, మమత, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కిష్టంపేటలో..

కొమురవెల్లి(సిద్దిపేట): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాజు సూచించారు. మండలంలోని కిష్టంపేటలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోటకు హుస్నాబాద్ షీ టీంతో కలసి వెళ్లి కూలీలకు మహిళ రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల మాయమాటలు నమ్మవద్దన్నారు. మహిళల భద్రతే పోలీసుల లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సైదయ్య, మహిళా కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.



నంగునూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న ట్రైనీ ఎస్‌ఐ సౌజన్య

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. మండల పరిధిలోని శుక్రవారం లింగుపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పంట దెబ్బతిన్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.40 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేక అకాల వర్షాలకు తడిసి ముద్దవుతోందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌళిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని అసహనం వ్యక్తం చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో వివిధ యువజన సంఘాల నాయకులు మహేశ్, అశోక్, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శంకర్

మురళీనాయక్ మృతికి గిరిజనుల సంతాపం



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు

కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళి

హుస్నాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జరిపిన దాడుల్లో భారత్ జవాన్ మురళీనాయక్ మృతి చెందడంతో గిరిజన సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పోరాడిన మురళీనాయక్‌ను పాకిస్తాన్ హతమార్చిందన్నారు. భారత జవాన్లపై దొంగదాడులు ప్రదర్శిస్తే ప్రతి పౌరుడు ఇండియన్ ఆర్మీగా మారి అంతు చూస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు తిరుపతి నాయక్, రాజు నాయక్, సంపత్ నాయక్, శ్రీనివాస్ నాయక్, వీరన్న నాయక్, బీక్యా నాయక్ తదితరులు ఉన్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటజోన్: జమ్ము కశ్మీర్ ప్రాంతంలో పాకిస్తాన్ ముష్కరుల దాడిలో వీర మరణం పొందిన మురళీనాయక్‌కు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కొవొత్తుల ప్రదర్శనతో నివాళులర్పించారు. స్థానిక గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. అనంతరం ముస్తాబాద్ చౌరస్తాలో మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భిక్షపతి, నాగరాజు, గోవర్ధన్, నవీన్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొవొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ధాన్యం తూకంలో అవకతవకలపై విచారణ

చేగుంట(తూప్రాన్): ధాన్యం తూకంలో అవకతవకలు జరిగాయనే విషయంలో రైతుల ఫిర్యాదుతో మక్కరాజీపేటలో తహసీల్దార్ శుక్రవారం విచారణ జరిపారు. ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఎక్కువగా తూకం వేశారని కేంద్రం నిర్వాహకురాలు అనితపై రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ తూకం యంత్రాన్ని పరిశీలించగా క్వింటాలుకు దాదాపు మూడు కిలోల ధాన్యం ఎక్కువగా తూకం వేస్తున్నారని గుర్తించారు. వెంటనే తూకం యంత్రాన్ని మార్చడంతో పాటు ఇప్పటి వరకు తూకం వేసిన రైతులు నష్టపోయిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు ఇప్పిస్తానన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులకు ఇబ్బంది కల్గించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

దుబ్బాకటౌన్: హబ్షీపూర్ 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలం, మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ గంగాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట, నగరం చిట్టాపూర్, ఎనగుర్తి, బొప్పాపూర్, మోతే, కూడవెల్లి, చిన్న నిజాంపేట, రామేశ్వరంపల్లి, తాళ్లపల్లి, చౌదర్‌పల్లి గ్రామాలకు, మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం, కొండాపూర్, అందె, కాసులబాద్ గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

హబ్షీపూర్ పరిధిలో...

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్షీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ గంగాధర్ పేర్కొన్నారు. అక్బర్‌పేటభూంపల్లి, పోతారెడ్డిపేట, నగరం, చిట్టాపూర్, ఎనగుర్తి, బొప్పాపూర్, మోతె, కూడవెల్లి, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి, తాళ్లపల్లి, చౌదర్‌పల్లి, మిరుదొడ్డి మండలం ధర్మారం, అందె, కాసులాబాద్, కొండాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సిద్దిపేటలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ కుషాల్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శివాజీనగర్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్ మెయిన్ రోడ్, హరిప్రియనగర్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణ ప్రాంతాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బండపోసాన్‌పల్లి 5వ వార్డులో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి గౌరి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో అటెండర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో వేసవి కాలం ఆరంభం నుంచి తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

నూతన నియామకం

చేగుంట(తూప్రాన్): జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన బాలసాయి హరిప్రసాద్ నియమితులయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు విఠల్, ప్రచార కమిటీ చైర్మన్ రమేశ్ నియామక పత్రం అందించినట్లు శుక్రవారం ఆయన తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

జిల్లాలోని పలు మండలాల పరిధిలో ఉపాధ్యాయులు, ఎంఈఓలు బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం ఆయా గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, సదుపాయాల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం ప్రైవేట్‌కు ధీటుగా పాఠశాలను బలోపేతం చేస్తుందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.



దుబ్బాకలో హెచ్‌ఎం జమిరొద్దీన్, ఉపాధ్యాయుల ఇంటింట ప్రచారం



మద్దూరు(హుస్నాబాద్): బైరాన్‌పల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మీనాంజనేయులు, ఉపాధ్యాయులు



బెజ్జంకిలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు



కోహెడరూరల్(హుస్నాబాద్): రాంచంద్రపూర్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం నర్సింహారెడ్డి